హనుమకొండ : సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

గ్రూప్ -1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

జూన్ 9న పరీక్ష నిర్వహణ కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ, మే 30 : జూన్ 9న నిర్వహించనున్న గ్రూప్ -1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. పరీక్ష నిర్వహణపై గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష పూర్తయ్యేంత వరకూ నిరంతర నిఘా పెట్టాలన్నారు. సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారి, ఆర్డీవో వెంకటేశ్, ఆర్టీసీ డీఎం ధరం సింగ్ పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

పరకాల : కల్తీ, నకిలీ విత్తనాలు అమ్మే షాపులపై, వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. పట్టణంలోని ఆగ్రోస్ సెంటర్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, స్టాకు వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నకిలీ విత్తనాల నియంత్రణకు చర్యలు తీసుకున్నామన్నారు. వ్యాపారులు నకిలీ, అనుమతి లేని విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాల, కామారెడ్డి పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలని, బెంచీలు, కుర్చీలు ఇతర సామగ్రి అందిస్తామన్నారు. ఏమైనా పెండింగ్ బిల్లులు ఉంటే పంపించాలని, డబ్బులు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటనారాయణ, ఆర్డీవో నారాయణ, ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు, తహసీల్దార్ భాస్కర్, ఎంఈవో రమాదేవి, ఐకేపీ ఏపీఎం కాంత్రి పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి

ముగ్గురికి తీవ్రగాయాలు

ఖానాపురం, మే 30: వరంగల్ జిల్లాలో గురువారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన స్నేహితులు రాజు, శ్రావణ్, గణేశ్, మహేశ్, చరణ్ బుధవారం కారులో భద్రాచలం బయల్దేరి గురువారం చేరుకున్నారు. దర్శనం అనంతరం వరంగల్ వేయిస్తంభాల ఆలయానికి కొత్తగూడ మీదుగా వెళ్తున్నారు. కొత్తగూడ మండలం సాదిరెడ్డిపల్లెకు చెందిన జీపీ కార్మికుడు పల్సం రవికిరణ్ తమ బంధువైన ములుగు జిల్లా రాయినిగూడేనికి చెందిన గొంది నర్సమ్మ(53)తో కలిసి బైక్‌పై పెళ్లి పనుల కోసం నర్సంపేటకు వచ్చారు. తిరిగి కొత్తగూడకు వెళ్తున్న క్రమంలో చిలుకమ్మ నగర్ శివారులో ఎదురుగా అతివేగంతో వచ్చిన కారు ఢీ కొట్టింది. దీంతో రవికిరణ్, నర్సమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో వారిని నర్సంపేటకు తరలించారు. నర్సమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందింది. పోలీసులు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అలాగే, ధర్మారావుపేటకు చెందిన రాజన్న తన భార్యతో కలిసి బైక్‌పై నర్సంపేటకు వచ్చి పనులు ముగించుకుని తిరిగి వెళ్తున్నాడు. బుధరావుపేట గోల్యాతండాకు చెందిన మంగీలాల్ వైద్యం కోసం ఖానాపురం వచ్చి తిరిగి గోల్యాతండాకు నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి రాజన్న బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో మంగీలాల్‌కు కాలు విరుగగా, రాజన్నకు తీవ్రగాయాలైనట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

అమరుల ఆశయాలను కొనసాగించాలి

నర్సంపేట, మే 30: అమరుల ఆశయాలను కొనసాగించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. కాచినపల్లి ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారి సంస్మరణ సభను నర్సంపేటలో న్యూడెమెక్రసీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. 1991 మే 29న పార్టీ దళ నాయకులు కోటన్న, సుసేన, చింతలక్ష్మి, సీతారామయ్య, పరశురాములును నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపిందని ఆరోపించారు. పీడిత ప్రజల సమస్యలు పరిష్కరించలేని దోపిడీ ప్రభుత్వాలు ప్రజల కోసం పోరాడుతున్న విప్లవకారులను చంపడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఎలకంటి రాజేందర్, బండి కోటేశ్వర్‌రావు, రాచర్ల బాలరాజు, గంగుల దయాకర్, సూర్యం, గట్టి కృష్ణ, జక్కుల తిరుపతి, బోగి సారంగపాణి, పూలక్క, బన్న నర్సింగం, హరిబాబు, వీరన్న పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

భవాని (ఫైల్)

నర్సంపేట రూరల్, మే 30: పాము కాటుతో మహిళ మృతి చెందిన ఘటన లక్నేపల్లిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోలంపల్లి వనమ్మ కుమార్తె భవాని(29) వివాహం తొమ్మిదేళ్ల క్రితం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచకు చెందిన వరిపల్లి రణధీర్‌తో జరిగింది. బుధవారం ఆమె తల్లిగారి ఇంటికి వచ్చింది. రాత్రి తన తల్లితో కలిసి ఇంట్లో నేలపై నిద్రించింది. ఈ క్రమంలో భవానిని పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.

పూడికతీత ఆపివేత

వర్ధన్నపేట, మే 30: ఉప్పరపల్లిలోని ఎల్లమ్మ చెరువులో పూడికతీత తను గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. చెరువులోని రేగడి మట్టిని అమ్మేందుకు పలువురు గ్రామ ప్రముఖులు మాట్లాడుతుండడంతో యువకులు, రైతులు అడ్డుకొని గత ఏడాదికి సంబంధించిన లెక్కలు చెప్పాలని నిలదీశారు. దీంతో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. మట్టిని అక్రమంగా అమ్ముకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, NEELOFOR, D/o KHAJA AZEEM UDDIN R/o 11-23-1310, L.B. Nagar, Warangal, Warangal Urban-506002, Telangana, India. I have Changed My Name to NEELOFOR JAHAN and Solemnly declare.

NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556
9182777557 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 MAHABUBABAD
9182777554 JANGAON
9182777565

కార్మికులకు అండగా బీఆర్ఎస్ పార్టీ

- నేడు కార్మిక సదస్సు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్

కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, మే 30 : బీఆర్ఎస్ కార్మికులకు అండగా నిలుస్తూ, వారి సంక్షేమానికి కృషి చేస్తున్నదని జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో భారత రాష్ట్ర సమితి కార్మిక విభాగం ఆధ్వర్యంలో కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 420 హామీలు, 6 గ్యారంటీలు అంటూ మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఆటో కార్మికులకు ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ ఏర్పాటు చేసి నెలకు రూ.15 వేల భృతి ఇవ్వాలని, కార్మిక భవన్ నిర్మాణానికి ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తాను పదవిలో ఉన్నా లేకున్నా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. తన రాజకీయ జీవితం కార్మికులతో మొదలైందన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో 10:30 గంటలకు నిర్వహించే సదస్సుకు కార్మికులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ నాయిని రవి, పుల్ల శ్రీనివాస్, నాయకులు ఇంజాల మల్లేశం, రవీందర్‌రెడ్డి, తేలు సారంగపాణి, కాస్వజు ప్రవీణ్, జన్ను సంజీవ, శ్రీధర్‌రెడ్డి, అరుణ్ కుమార్, కాటపురపు రాజు, భిక్షపతి కృష్ణ, రవి పాల్గొన్నారు.

అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

కార్పొరేటర్లను ఆహ్వానించాలి ■ గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, మే 30 : జూన్ 2న నిర్వహించే రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. గురువారం కార్పొరేషన్‌లో చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కార్యాలయ ఆవరణను అందంగా ముస్తాబు చేయాలన్నారు. కార్పొరేటర్లకు ఆహ్వాన పత్రాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ అనీసుర్ రషీ ద్, సీఎంహెచ్‌వో రాజేశ్, హెచ్‌వో రమేశ్, ఈఈ సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మత్స్యశాఖ ఎన్నికలు నిర్వహించాలి

హనుమకొండ చౌరస్తా, మే 30 : కొన్ని నెలలుగా తాత్కాలిక పద్ధతిలో జిల్లా మత్స్యశాఖకు అడ్‌హక్ అండ్ చీఫ్ ప్రమోటర్‌ను ఎన్నుకుంటున్నామని, వారి 3 నెలల కాలపరిమితి ముగిసినందున తిరిగి శాశ్వత పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని గురువారం మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ జిల్లా మత్స్య శాఖ అధికారి విజయభారతిని కోరారు. జిల్లాలో మహిళా సొసైటీల ఏర్పాటుకు సహకరించాలని, పెండింగ్‌లో ఉన్న ఇన్సూరెన్స్ క్లియర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు, హనుమకొండ, వరంగల్ జిల్లాల ప్రధాన కార్యదర్శులు అమ్మగారి శ్యామ్, పెండ్యాల కృష్ణ, వినోద్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

ఆస్తి కోసం అత్తింటి ఎదుట బైఠాయింపు

పూట గడవడం లేదంటూ ఆందోళన

కమలాపూర్, మే 30 : మండలంలోని గూనిపర్తికి చెందిన రామగోని స్వప్న ఆస్తి కోసం అత్తింటి ఎదుట గురువారం భర్త రఘువీరరాజు, ఇద్దరు పిల్లలతో కలిసి బైఠాయించింది. అత్తింటి ఆస్తి ఇవ్వకుండా అత్త చంద్రకళ, చిన్న కొడుకు యుగేంధర్ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, రెండేళ్ల క్రితం కుటుంబంలో చిన్న గొడవ జరగడంతో తన భర్త రఘువీరరాజు పురుగుల మందు తాగినట్లు స్వప్న చెప్పారు. దీంతో తన భర్త కాళ్లు, చేతులు పనిచేయక మంచంలోనే ఉంటున్నాడని, రెండేళ్లుగా ఆయనకు సపర్యలు చేస్తూ ఇద్దరు పిల్లలను పోషిస్తున్నట్లు తెలిపారు. భర్త వైద్యం కోసం అప్పులు చేయిస్తున్నానని, తన వాటాకు రావాల్సిన వ్యవసాయ భూమితో పాటు ఇంటి స్థలం ఇస్తే భర్త, ఇద్దరు పిల్లలను కాపాడుకుంటానని కన్నీటి పర్యంతమైంది. తిండామంటే తిండిలేదు ఉండామంటే ఇల్లు లేదని, కుటుంబాన్ని పోషించుకునేందుకు తన తల్లివాళ్ల ఇల్లు ఎల్కతుర్తిలో బతుకుతున్నట్లు చెప్పారు. తన భర్తకు రావాల్సిన వాటా ఇప్పించాలని వేడుకుంటున్నది. విషయం తెలుసుకున్న ఎస్సై వీరభద్రరావు ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

రైల్వే చరిత్రలో '1974 సమ్మె' చరిత్రాత్మకం

కాజీపేట, మే 30 : భారత రైల్వే డ్రైవర్లు, అసిస్టెంట్ డ్రైవర్లు కేంద్ర ప్రభుత్వ నిర్బంధాన్ని తట్టుకుని 1974లో 20 రోజుల పాటు చేపట్టిన సమ్మె రైల్వే చరిత్రలోనే చరిత్రాత్మికంగా నిలిచిపోయిందని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఏఐఆల్ఆర్ఎస్ఏ) ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు హనుమయ్య అన్నారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో గురువారం 1974లో జరిగిన రైల్వే కార్మికుల సమ్మె డైమండ్ జూబ్లీ వేడుకల సందర్భంగా డివిజన్ నాయకుడు ఏవీఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 1974లో రైల్వే కార్మికులను బానిసలుగా పని చేయించుకుంటూ, అధిక పని గంటల భారం మోపిందన్నారు. కార్మికుల నిర్బంధానికి వ్యతిరేకంగా 20 రోజుల పాటు దేశవ్యాప్తంగా 17 లక్షల మంది కార్మికులు సమ్మె చేశారన్నారు. ఆనాడు సమ్మెలో పాల్గొన్న విశ్వనాథన్, ఐలయ్య, కేవీ లక్ష్మణ్ తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో జిలాని, ఎంకే మూర్తి, గోవింద రాజులు, సుధీర్, రమేశ్, సీఐటీయూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు చుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న హనుమయ్య

పంటల సాగుపై రైతులకు అవగాహన

ప్రొటోకాల్ పాటించలేదని కార్పొరేటర్ ఆవేదన

ఖిలా వరంగల్, మే 30 : తూర్పుకోటలోని రైతు వేదిక భవనంలో వర్షాకాలం పంటల సాగుపై వ్యవసాయ శాఖ గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసింది. వానకాలంలో విత్తనాల కొనుగోళ్లు తదితర అంశాలపై ఏడీఏ సురేశ్ రైతులకు వివరించారు. సదస్సులో ఏవో విజ్ఞాన్, ఏఈవో చంద్రకాంత్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బెడిద వీరన్న, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఏసిరెడ్డి ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు కలకోట్ల కుమార్, రఘు, సిరబోయిన గిరి, వనపర్తి కరుణాకర్ పాల్గొన్నారు. కాగా, ఖిలావరంగల్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ప్రొటోకాల్ పాటించలేదని 37వ డివిజన్ కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కార్పొరేటర్, రైతులను పిలువకుండా కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారని విమర్శించారు. బాధ్యులైన ఏవో, ఏఈవోలపై చర్యలు తీసుకునేలా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

రైతు ఆత్మహత్య

సంగెం, మే 30 : పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముమ్మిడివరం గ్రామానికి చెందిన దామెరుప్పుల సారయ్య(70) తన ఇద్దరు కుమారులు రాజేశ్వర్, విజయ్‌కుమార్‌కు భూమిని పంచి ఇచ్చాడు. చిన్న కుమారుడు విజయ్‌కుమార్ భార్య, తన తండ్రి సారయ్యకు చెప్పకుండా హనుమకొండకు చెందిన నిమ్మగాని శేఖర్‌రావు, విజయలక్ష్మి వద్ద తన భూమి పట్టాపాసు పుస్తకం పెట్టి రూ 1,50,000 లు తీసుకున్నాడు. విషయం తెలిసి అతడి భార్య గొడవ పెట్టుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కాగా, సారయ్య గ్రామానికి చెందిన ఇద్దరు పెద్ద మనుషులను తీసుకుని నిమ్మగాని శేఖర్‌రావు, విజయలక్ష్మి వద్దకు వెళ్లి తక కొడుకు తీసుకున్న డబ్బులు ఇస్తామని పట్టా పాసుపుస్తకం ఇవ్వాలని అడుగగా, నానా బూతులు తిట్టి అవమాన పరిచారు. దీంతో మనస్తాపం చెందిన సారయ్య బుధవారం సాయంత్రం వ్యవసాయబావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయనను ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. నిమ్మగాని శేఖర్‌రావు, విజయలక్ష్మి వల్లే తన తండ్రి మృతిచెందాడని పెద్ద కుమారుడు రాజేశ్వర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

ఇస్తారికి పేటెంట్ సర్టిఫికెట్

హనుమకొండ చౌరస్తా, మే 30 : కేయూ అకుట్ జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి 'అంత్రాక్వినోన్ ఆఫ్ రుమేక్స్ వేసికారియాస్ యాజ్ ఏ డై-పెప్టిడైల్ పెప్టిడేజ్ ఇన్హిబిటర్' అనే అంశంపై చేసిన పరిశోధనకు భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం పేటెంట్ సర్టిఫికెట్‌ను జారీ చేసింది. మార్చి 21న ఈ అంశానికి సంబంధించిన పేటెంట్ డాక్యుమెంట్‌లను ఫైల్ చేయగా మార్చి 26న ఇస్తారి, రిసెర్చ్ స్కాలర్ రాకేశ్ పేరుపై పేటెంట్‌ను 29 మే 2024న గ్రాంట్ చేసిందని తెలిపారు. ఇస్తారిని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి అభినందించారు.

'స్వేరోస్‌ను గూండాలనడం సిగ్గుచేటు'

హనుమకొండ చౌరస్తా, మే 30 : ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గాంధీభవన్‌లో స్వేరోస్‌ను గూండాలనడం సిగ్గుచేటని రాష్ట్ర స్వేరోస్ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ అన్నారు. గురువారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. స్వలాభం కోసం స్వేరోస్‌ను గుండాలు అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. సమావేశంలో స్వేరోస్ రాష్ట్ర ఈసీ మెంబర్ మారెపల్లి మనోజ్, జిల్లా అధ్యక్షుడు రామకాంత్, ఎస్ఎస్‌యూ ఎల్తూరి సాయికుమార్, పూర్ణ, చంటి, చందు, ప్రసాద్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్‌కు విద్యుత్ షాక్

ఐనవోలు, మే 30: కక్కిరాలపల్లికి చెందిన జీపీ మల్టీపర్పస్ వర్కర్ జంపాల కుమారస్వామి గురువారం విద్యుత్ అధికారులతో కలిసి గ్రామంలో డీటీఆర్‌ని మారుస్తుండగా షాక్ గురయ్యాడు. వెంటనే గ్రామస్తులు, కుటుంబ సభ్యులు చికిత్స కోసం అతడిని ఓ ప్రైవేట్ దవాఖానకకు తరలించారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరికి గాయాలు

నర్సంపేట రూరల్, మే 30: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. చెన్నారావుపేట మండలం జల్లి గ్రామానికి చెందిన బోడ మోహన్ బైక్‌పై నర్సంపేటకు వెళ్తున్నాడు. మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన ఓ వ్యక్తి బైక్‌పై నర్సంపేట నుంచి నెక్కొండ వైపు వెళ్తున్నాడు. ముగ్దుంపురం క్రాస్‌రోడ్డు సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో మోహన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు నర్సంపేటకు తరలించారు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

సంగెం(గీసుగొండ)మే 30 : మత్స్యకారులందరూ ఆర్థికంగా ఎదగాలని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ ఆకాంక్షించారు. గీసుగొండలో గురువారం రైతువేదికలో ప్రకృతి పర్యావరణం ఆధ్వర్యంలో మత్స్య సహకార సంఘాల సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రకృతి పర్యావరణ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

3 నుంచి బడిబాట

హనుమకొండ చౌరస్తా, మే 30 : జూన్ 3 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈవో అబ్దుల్ హై తెలిపారు. పాఠశాల వయసు పిల్లలందరినీ గుర్తించి, వారిని సమీప పాఠశాలల్లో చేర్పించనున్నట్లు తెలిపారు.

గోవధ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలి

కాశీబుగ్గ, మే 30: గోవధ నియంత్రణకు ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, గోమాంసం విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు మట్టెవాడ సీఐ తుమ్మ గోపి, పశువర్ధక శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు పోలీసులకు వినతిపత్రం అందజేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొమ్మ నాగరాజు, గోరక్ష ప్రముఖ్ సంగినేని రాజేశ్, ఖిలా ప్రఖండ బజరంగ్‌దల్ సంయోజక్ తుంగ సతీశ్, పల్లె ప్రదీప్‌గౌడ్, ఎల్గం భరత్, విట్టల్‌రెడ్డి, చతుర్గంజి శ్రీకర్, ఇనుముల సతీశ్, రావుల శేఖర్, బూర నాగరాజు, మాకల ప్రవీణ్, మిరియాల రవి, భరత్ పాల్గొన్నారు.

ప్లానింగ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

■ ఆర్వో, కలెక్టర్ ప్రావీణ్య ■ పకడ్బందీ నిర్వహణకు దిశానిర్దేశం

కాశీబుగ్గ, మే 30: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆర్వో, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. జూన్ 4న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గురువారం ఆమె ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో సీపీ అంబర్ కిశోర్ ఝా, గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, హనుమకొండ, వరంగల్ అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, సంధ్యారాణి, డీసీపీ రవీందర్, డీఆర్వో శ్రీనివాస్‌తో కలిసి వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. మూడంచెల భద్రత వ్యవస్థ, వాహనాల పార్కింగ్ మళ్లింపు, బారికేడింగ్, పారిశుధ్యం, తాగునీరు, ఎన్నికల సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లకు భోజన సదుపాయం, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్యం, మొబైల్ అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచడం, అగ్నిమాపక నివారణ పరికరాలు, వాహనాల ఏర్పాట్లు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించి, పకడ్బందీ నిర్వహణకు దిశానిర్దేశం చేశారు. రాజకీయ పార్టీల ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీ చేస్తామని ప్రావీణ్య అన్నారు. కౌంటింగ్ పూర్తయిన అనంతరం ఈవీఎంలను తిరిగి స్ట్రాంగ్ రూంల్లో భద్రపరిచి సీల్ వేస్తారని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు.

విశ్రాంత అగ్ర పీఠాధిపతి తుమ్మ బాల మృతి

తుమ్మ బాల (ఫైల్)

ధర్మసాగర్, మే 30 : హైదరాబాద్ విశ్రాంత అగ్రపీఠాధిపతి, ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ చైర్మన్ తుమ్మ బాల (80) గురువారం మృతి చెందారు. మండలంలోని కరుణాపురంలోని దివ్య జ్యోతి నిలయంలోని తన సోదరి వద్ద ఉంటూ అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. కాగా, జిల్లా పరిషత్ చైర్మన్ సుధీర్ కుమార్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతం ఆయన మృతదేహాన్ని ఫాతిమానగర్ దేవాలయానికి తరలించారు. ప్రత్యేక పూజ అనంతరం పార్థివదేహాన్ని హైదరాబాద్‌కు తరలించారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ దేవాలయంలో పూజ అనంతరం అంతక్రియలు జరుగనున్నాయి.

'ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను విమర్శిస్తే సహించేదిలేదు'

వర్ధన్నపేట, మే 30: బడుగు బలహీన వర్గాల పిల్లల విద్యాభివృద్ధి, సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను విమర్శిస్తే సహించేది లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంద శ్యామ్ హెచ్చరించారు. మండలకేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పోలీసు అధికారిగా పని చేసిన ఎమ్మెల్యే నాగరాజు ఎంతమంది స్వేరోలపై రౌడీషీట్లు ఓపెన్ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం సీఎం రేవంత్‌రెడ్డి వద్ద మార్కులు పొందేందుకు ప్రవీణ్‌కుమార్‌ను విమర్శించడం సరికాదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు తుమ్మల యాకయ్య, సిలువేరు కుమారస్వామి, జన్ను రాములు, పిట్టల రాజు, కొండేటి శ్రీనివాస్, కంజర్ల మహేశ్, యాకయ్య, సుధాకర్, భాస్కర్, బాబు, వంశీ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దిష్టిబొమ్మ దహనం

హనుమకొండ చౌరస్తా, మే 30 : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ వర్సిటీ మొదటి గేటు వద్ద నాగరాజు దిష్టిబొమ్మ దహనం చ